

# తావొ తె చింగ్

## లావో త్సు

అనువాదం

దీవి సుబ్బారావు

# లావో త్సు

## తావొ తె చింగ్

ఇంగ్లీషు నుండి అనువాదం

దీవి సుబ్బారావు

# tao te ching

lao tzu

Tanslation from English
Deevi Subba Rao

First Published:
March 2018

Book Design:
Brahmam, Bhavana Grafix,
Hyderabad, 9848254745

Printed at:
Karshak Art Printers,
Hyderabad.

For Copies:
Navodaya Book House,
Kachiguda, Hyderabad
Ph : 9247471361

For E.Book:
kinige.com

₹ 100/-

# పరిచయం

**తా**వొ తె చింగ్ చైనీయుల కళలను కవిత్వాన్నే గాక మొత్తం వారి ఆలోచనా విధానాన్నీ సంస్కృతినీ ప్రభావితం చేసిన ఉద్గ్రంథం. క్రీస్తు పూర్వం ఐదు, ఆరు శతాబ్దాల్లో దీని రచన జరిగినట్లూ, రచయిత లావోత్సు అనే మహనీయుడు అయినట్లూ చరిత్రకారులు చెబుతారు.

గ్రంథంలో 81 చిన్న చిన్న అధ్యాయాలు వున్నవి. మొదటి 37 ఒక భాగం. మిగతా 44 రెండో భాగం. వీటిల్లో కొన్ని కవితాత్మకంగా, కొన్ని గద్యప్రాయంగా వుంటవి. గ్రంథం పేరు తావొ తె చింగ్ అని వ్రాస్తారు గాని, పలకటం డావొ డె జింగ్ అని పలుకుతారట. చీనీ భాషలో వున్న మూల గ్రంథం మొదటి భాగం 'తావొ' అనే పదంతోను, రెండవ భాగం 'తె' అనే పదంతోను మొదలవుతవి. అందువల్ల పుస్తకానికి తావొ తె చింగ్ అని పేరు పెట్టడం జరిగింది. 'తావొ' అంటే సామాన్యంగా అందరూ చెప్పే అర్థం 'పథం' అని. ఈ ఒక్క అర్థమే కాక చీనీ భాషలో ఈ పదానికి ప్రకృతి ధర్మం, ప్రక ృతి నియమం, చైతన్యం, సృష్టికర్త, దేవుడు అనేవి కూడా వున్నవని చెబుతారు. 'తె' అంటే నైతిక ఉత్కర్ష. చింగ్ అంటే గ్రంథం. 'తావొ తె చింగ్' అంటే నైతిక ఉత్కర్షకు సంబంధించిన పథాన్ని తెలిపే గ్రంథం అని స్థూలంగా

అర్థం చేసుకోవచ్చు. మొదటి భాగం 'తావొ' అనే పదంతో మొదలవుతుంది గాబట్టి ఆ భాగాన్ని 'తావొ చింగ్' అనీ, రెండో భాగం 'తె' అనే పదంతో మొదలవుతుంది గాబట్టి ఆ భాగాన్ని 'తె చింగ్' అనీ అంటారు.

కొందరు పరిశోధకుల దృష్టిలో ఈ గ్రంథం ఏ ఒక్కరివల్లో ఏక కాలంలో వ్రాయబడింది కాదు. పేరు తెలియని జ్ఞానులు ఎందరో చెప్పిన సూక్తుల్ని తరువాత కాలంలో కొందరు పండితులు ఒక చోట జేర్చి గ్రంథంగా తయారు చేశారు. 'లావో త్సు' అంటే చీనీ భాషలో వయసుమళ్ళిన పెద్ద మనిషి అని అర్థం. దీన్ని బట్టి కూడా ఈ గ్రంథం వ్రాసింది ఎవరో, అతని పేరు ఏమిటో తెలియవని అంటున్నారు. ఇదిట్లావుండగా లావొత్సు అనే పేరుగల ఆయన గురించి చైనాలో చాలా కట్టు కథలు వున్నవి. అతడు పథాన్ని (తావొ) అనుసరించి యోగ సాధన చేశాడనీ, 120 ఏళ్ళో, 160 ఏళ్ళో జీవించాడనీ కొందరంటే, కాదు అతడు మరణించనే లేదని కొందరంటారు. అతడు ఎందుకు మరణించలేదంటే, అతడు అసలు పుట్టనేలేదు కాబట్టి అని మరికొందరు చతురోక్తులు ఆడుతారు. ఈ గ్రంథం ఇప్పటి రూపంలో క్రీ.పూ. 3వ శతాబ్దంలో ఒక కొలిక్కి వచ్చిందని అంటారు.

ఎందరు ఏమనుకొన్నా, లావోత్సు చారిత్రక పురుషుడనే ఎక్కువమంది విద్వాంసుల విశ్వాసం. వారి మాటలను బట్టి లావోత్సు ప్రభుత్వం వారి ప్రాచీన పత్రాలు భద్రపరచటానికి నియమింపబడిన ఉద్యోగి. కన్‌ఫ్యూషియస్ (551-479 క్రీ.పూ) అనే ఇంకో ప్రసిద్ధ తాత్వికుని కంటే వయసులో పెద్దవాడు. ఒకసారి కన్‌ఫ్యూషియస్, లావోత్సును కలవటం జరిగిందట. తరువాత లావోత్సు గురించి కన్‌ఫ్యూషియస్ తన శిష్యులకు ఈ విధంగా చెప్పాడుట: "నాకు పక్షి ఎగరటం తెలుసు. చేప ఈదటం తెలుసు. జంతువు పరుగెట్టటం తెలుసు. పరుగెత్తే దాన్ని పట్టటానికి వల తయారుచేయించవచ్చు. ఈదే

దాని కొరకు గాలం తయారు చేయించవచ్చు. ఎగిరే దాని కొరకు బాణం తయారు చేయించవచ్చు. కాని, ఆకాశంలోకి గాలి మీద, మబ్బుల మీద దూసుకువెళ్ళే డ్రాగన్‌ను గురించి తెలుసుకోవటం నాకు శక్తికి మించిన పని. ఇవాళ నేను లావోత్సును చూశాను. బహుశా అతడు ఈ డ్రాగన్ లాంటివాడు." కన్‌ఫ్యూషియస్ లాంటి తాత్వికుని నోటి నుండి వెలువడ్డ ఇంతటి ప్రశంసను బట్టి లావోత్సు ఎంతటి వాడో ఊహించుకోవచ్చు.

లావోత్సు తన గ్రంథంలో చెప్పిన విధంగా పథాన్ని అనుసరించి చాలా కాలం జీవించాడనే చెప్పవచ్చు. తాను అనుకొన్న విలువలు సమాజంలో క్షీణదశకు రావటం గమనించాడు. సమాజం నుండి దూరంగా వెళ్ళిపోవాలని నిర్ణయించుకొన్నాడు. అలా వెళ్తుండగా, దార్లో కాపలాదారుడు ఒకడు అడ్డుపడ్డాడు. అతడికి లావో త్సు గొప్పదనం తెలుసు. అతడు అడిగాడు, "మీరు ఎలాగూ వెళ్తున్నారు గాబట్టి, వెళ్ళేముందు మీ ఆలోచనలతో ఒక గ్రంథం వ్రాయండి," అని. అలా ఆ కాపలాదారు కోరిక మేరకు వచ్చిందే 'తావొ తె చింగ్' గ్రంథం.

గ్రంథం 2500 ఏళ్ళ కిందటిది కావచ్చు గాని, ఈ కాలానికి వర్తించే జీవిత సత్యాలు ఇందులో వున్నవి. మనుషుల్ని చైనీయులుగా, అమెరికన్లుగా, యురోపియన్లుగా, భారతీయులుగా ఇట్లా అనేక విధాలుగా విడగొట్టకుండా మానవులుగా చూసినప్పుడు, ఋషి వంటి లావో త్సు మాటలు మనందరికీ శిరోధార్యాలవుతాయి.

# మొదటి భాగం

# 1

దేన్ని అయితే పథము అని అంటున్నారో అది స్థిరమైన పథము కాదు.
ఏ నామం వల్ల గుర్తింపు కలుగుతున్నదో అది స్థిరమైన నామం కాదు.
నామరహితమైనది భూమ్యాకాశాల పుట్టుకకు ముందు వున్నది.
నామసహితమైనది సమస్త ప్రాణకోటికి మాతృక.
సంతత నిరాసక్తత సృష్టిరహస్యం బోధపరుస్తుంది.
నిరంతర ఆసక్తత సృష్టి స్థితిని గోచరింపజేస్తుంది.
రెండింటి మూలం ఒకటేగాని పేర్లు భిన్నమైనవి.
ఈ రెండింటి నడుమ నిగూఢ రహస్యమొకటున్నది.
రహస్యాలలోకెల్ల రహస్యం.
చీకటి లోపల చీకటి.
సమస్త రహస్యాలకు ప్రవేశద్వారం.
అన్ని అద్భుతాలకు ఆదిమూలం.

# 2

లోకంలో అందరూ సౌందర్యాన్ని సౌందర్యంగా గుర్తిస్తారు,
కురూపం ఉండటంచేత.
మంచిని మంచిగా చూస్తారు, చెడు వుండటం చేత.
ఉండటం, లేకపోవటం: ఒకటి రెండవదానికి కారణమౌతుంది.
కష్టం, సుఖం: ఒకటి రెండవదాన్ని సంపూర్ణం చేస్తుంది.
దీర్ఘం, హ్రస్వం: ఒకదానికొకటి సంబంధం వుంది.
ఎత్తు, పల్లం: ఒకటి రెండవదానిపై ఆధారపడి వుంది.
స్వరము, ధ్వని: ఒక దానితో ఒకటి మేళవిస్తవి.
ఆది, అంతము: ఒకదానినొకటి అనుసరిస్తవి.

జ్ఞానులు ఏపనీ చేసినట్లు కనిపించరు. మాటలతో బోధించరు.
సృష్టిస్తారే గాని సొంతం చేసుకోరు.
శ్రమిస్తారు. పేరు ఆశించరు.
పని పూర్తయాక దాని గురించి పట్టించుకోరు.
అందువల్ల అది శాశ్వతత్వం సిద్ధింపజేసుకొంటుంది.

# 3

ప్రతిభావంతులకు ఉన్నతాసనాలు ఇచ్చి విడిగా కూర్చోబెట్టకపోతే
ప్రజల్లో అసూయలుండవు.
విలువైన వాటిని నిలువజేయకపోతే, దేశంలో దొంగలుండరు.
కోర్కె రగిలించే వస్తువులు చూడకపోతే, మనశ్చాంచల్యం వుండదు.

అందువల్ల జ్ఞానులు తమ పరిపాలనలో
ప్రజల మనస్సులను శూన్యం చేస్తారు గాని పొట్టల్ని నింపుతారు.
సంకల్పాలను తగ్గిస్తారు గాని ఎముకలు గట్టిపరుస్తారు.

జనాల్లో తెలివి తేటలు, కోరికలు కొరవడినా
వారు కల్పించుకోరు.

ఏ పనీ చేయనప్పుడు అన్ని పనులు సాధ్యమౌతవి.

## 4

పథం శూన్యకలశం లాంటిది.
వాడుకలో వుంటుంది కాని ఏనాడూ నిండదు.
అగాథము. సమస్త వస్తువులకు ప్రాణదాత.
పథంలో కరుకుదనం మొద్దుబారుతుంది.
చిక్కులు విడిపోతవి.
ఎండవేడిమి చల్లబడుతది. దుమ్ముధూళి మెత్తనౌతది.
అది ఎప్పుడూ ఎండిపోని నీటికుంట వంటిది.
దాని పుట్టుక ఎక్కడో నాకు తెలియదు గాని
కచ్చితంగా అది మన తాత ముతాత్తలకంటే ముందు పుట్టింది.

# 5

భూమ్యాకాశాలకు పక్షపాతం లేదు.
పదివేల వస్తువులు ఎలాగవుంటే వాటిని అలాగ చూస్తవి.
జ్ఞానులకూ పక్షపాతం లేదు.
అందరు మనుషులు ఎలాగవుంటే వారిని అలాగే చూస్తారు.

భూమికీ ఆకాశానికీ మధ్య ప్రదేశం కొలిమితిత్తి వంటిది.
రూపం మారుతుంది. నిర్మాణం మారదు.
ఎంత ఎక్కువ కదిపితే అంత ఎక్కువ ఫలమిస్తుంది.

కాని, ఎక్కువ మాటలకు తక్కువ విలువ వుంటుంది.
అందువల్ల మధ్యేమార్గం మంచిది.

## 6

లోయ ఆత్మ ఏనాటికీ మరణించదు.
దానిపేరు అనూహ్య స్త్రీమూర్తి.
అనూహ్య స్త్రీమూర్తి ప్రవేశద్వారం
భూమ్యాకాశాల మూలమై వున్నది.

ఇది సదా మనలోనే వున్నది.
దీని క్రియా కలాపం విరామం లేక సాగుతున్నది.

# 7

ఆకాశం అనంతం.
భూమి చిరంతనం.
భూమ్యాకాశాలు అలా ఎలా కాగలిగినవి?
అవి సృష్టించబడలేదు.
అందువల్ల చిరస్థాయిగా మనగలవు.

జ్ఞానులు వెనుక నిలబడతారు. కాబట్టి అందరికంటె
ముందు వుంటారు.
వారు నిరాసక్తులు. అయినా అందరిలో కలిసిపోతారు.
వారు కోరదగ్గది ఏమీలేదు.
అందువల్ల వారు పొందలేనిది ఏదీలేదు.

## 8

సర్వశ్రేష్ఠమైనది నీటిని పోలివుంటుంది.
నీరు పదివేల వస్తువులకు ప్రాణదాత.
అయినప్పటికీ అది అతిగా శ్రమించదు.

జనం ఒల్లని చోటుల్లో ప్రవహిస్తుంది గాబట్టి
పథానికి చేరువై వుంటుంది.

భూమికి సమీపంలో నివాసగృహాన్ని నిర్మించు.
ధ్యానంలో, హృదయం లోలోపలకు వెళ్ళు.
ఇతరులతో వ్యవహరించేటప్పుడు నెమ్మదిగా దయగా వుండు.
నిజం పలుకు.
న్యాయంగా పాలించు.
వ్యాపారంలో దక్షత చూపించు.
అనుకూల సమయంలో కార్యం నిర్వహించు.
ఎవరితోను గొడవల్లేకపోతే
ఎవరివల్ల నింద వుండదు.

# 9

పొర్లిపోయేట్లు పాత్ర అంచుదాకా నీరు నింపటం దేనికి?
కత్తికి ఎంతగా పదును పెట్టినా అది ఎంతకాలం నిలుస్తుంది?
బంగారం పచ్చలతో నింపిన భాండాగారాన్ని ఎంతకాలం
కాపలా కాయగలవు?
మితిమీరిన ధనగౌరవాలు ఉపద్రవానికి దారితీస్తవి.
నీ కర్తవ్యం నీవు నిర్వహించాక దూరంగా తొలగివుండు.
అలాగవుంటే స్వర్గం నీ చేతికి అందివచ్చినట్లు అవుతుంది.

# 10

ఏకమైన పథాన్ని, నీ దేహంతో ఆత్మతో ఆశ్రయించి
రెండింటిని విడివడకుండ చేయగలవా?
శ్వాసను నియంత్రించి ఎంతగా మృదుత్వాన్ని పొందినా
పసిపాపను పోలగలవా?
రహస్యమయమైన నీ ఆంతరంగిక దర్పణాన్ని తుడిచి
మలినం లేకుండా చేయగలవా?
ప్రజల్ని ప్రేమించి పాలించి
అకర్మస్థితిని అందుకోగలవా?
స్వర్గద్వారాల్ని మూయటంలో తెరవటంలో
స్త్రీపాత్రను సమర్థవంతంగా పోషించగలవా?
నీ మేధస్సు నలుదిశల ప్రసరించినప్పటికీ
ఏమీ తెలియనివానివలె వుండగలవా?
జన్మను ప్రసాదించటం, సాకటం, కర్మణ్యుడై వుండటం
ఘనతను కోరకుండా వుండటం, ముందుండి నడిపించటం–
ఇట్టిది పథానికి వున్న రహస్యశక్తి.

# 11

బండి ముంతలో ముప్పై ఆకులు దిగ్గొట్టినా, బండి ప్రయోజనం
దాని ఖాళీ ప్రదేశంలోనే వుంది.
మట్టిని పాత్రగా తీర్చిదిద్దినా, పాత్ర ప్రయోజనం
దాని ఖాళీ ప్రదేశంలోనే వుంది.
ఇంటికి తలుపులు ద్వారబంధాలు అమర్చినా, ఇంటి ప్రయోజనం
దాని ఖాళీ ప్రదేశంలోనే వుంది.

అందువలన ఉన్నదానితో లాభం ఏ విధంగా పొందుతామో
లేనిదాని ఉపయోగం ఆ విధంగానే గుర్తించాలి.

## 12

అనేక రంగులు కంటికి ముప్పు.
అనేక శబ్దాలు చెవికి చేటు.
అనేక రుచులు జిహ్వాకు చెరుపు.
మితిమీరిన వేట సరదా, అదుపులేని గుర్రపుస్వారీ
మనస్సుకు పిచ్చెక్కిస్తవి.

అందువల్ల జ్ఞానికి అనుభవంలో వున్నది ముఖ్యంకాని
కంటిని ఆకర్షించే బయటి వస్తువు కాదు.
దేన్ని పొందాలో, దేన్ని విడువాలో అతడికి తెలుసు.

# 13

ప్రశంస, అవమానం రెండింటికీ సమానంగానే భయపడి దూరంగా వుండాలి. ఆ విధంగానే గౌరవం, ఘోరవిపత్తు రెండింటినీ వ్యక్తిగత విషయాలుగా పరిగణించాలి.

ప్రశంస, అవమానం రెండింటికీ సమానంగానే భయపడి దూరంగా వుండాలి అనటంలో అర్థం ఏమిటి? అవమానం అంటే ప్రశంసను అనుభవించిన వెనుక కింది స్థానానికి దిగజారటం. ప్రశంసను పొందిన తరువాత దాన్ని చేజార్చుకొంటామేమో అనే భయం వెన్నాడుతుంది. అలా చేజార్చుకోవటం అనేది అంతకంటే ఘోరవిపత్తు సంభవిస్తుందేమో అనే భయానికి దారి తీస్తుంది. ప్రశంస, అవమానం రెండింటికీ సమానంగానే భయపడి దూరంగా వుండాలి అనే మాటకు అర్థం ఇది.

గౌరవం, ఘోరవిపత్తు రెండింటినీ వ్యక్తిగత విషయాలుగా పరిగణించాలి అనే మాటకు అర్థం ఏమిటి? ఘోర విపత్తుకు నన్ను గురిచేయగలిగింది నాకున్న దేహమే గదా! (అంటే నేనే కదా!) నాకు ఈ దేహమే లేకపోతే ఎంతపెద్ద విపత్తు అయినా ఎలా నాకు కలుగుతుంది?

అందువల్ల రాజ్యాన్ని తన దేహంవలె భావింపగలవానికి రాజ్యాన్ని పాలించడానికి అప్పగించవచ్చు. రాజ్యాన్ని తన దేహంలా ప్రేమించగలవానికి రాజ్యపాలనాన్ని అప్పగించవచ్చు.

# 14

గుచ్చి గుచ్చి చూస్తాము. కనపడదు. అస్పష్టంగా వున్నదంటాము.
చెవి ఒగ్గుతాము. వినపడదు. శ్రుతి గోచరం కాదంటాము.
తగులుతుంది. పట్టలేము. సూక్ష్మమైనదంటాము.
ఈ మూడు గుణాలు అనిర్వచనీయాలు.
అందువల్ల అన్నీ ఒకటిగా మేళవిస్తవి.

దాని ఉదయం కాంతిమయం కాదు.
అస్తమయంతో చీకటి కమ్మదు.
నిర్వచనానికి అతీతమై, అనంతమై విస్తరించి
తిరిగి శూన్యంలోకి చేరుకొంటుంది.
అది ఆకారం లేని దానికి ఆకారం
రూపం లేనిదానికి రూపం కల్పిస్తుంది.

ఫలానా అని స్పష్టంగా చెప్పలేనిది. ఊహాతీతమైనది.

దాని ఎదురుగా వెళ్ళు. ముందుభాగం కనిపించదు.
అనుసరించి వెళ్ళు. వెనుకభాగం అవుపించదు.

ప్రాచీన పథాన్ని అనుసరించి, ప్రస్తుత జీవితాన్ని గడిపితే
మొట్టమొదటి యుగారంభాన్ని తెలుసుకోగలం.

పథ రహస్య సూత్రం అంటే ఇదే.

## 15

పూర్వం పథం అనుసరించటంలో నిపుణులైన జ్ఞానులు
గంభీర స్వభావులు అద్భుతావహులు.
వారి జ్ఞానం లోతు సామాన్యులు అందుకోలేనిది.
అందుకోలేనిది కాబట్టి మనం చేయగలిగిందల్లా
వారి రూపురేఖల్ని వర్ణించటం.

వారు కడు జాగరూకులు, చలికాలం ఏరు దాటే వారి వలె.
అప్రమత్తులు, ప్రమాదాన్ని పసిగట్టిన వారి వలె.
మర్యాదస్తులు, చూడవచ్చిన అతిథుల వలె.
సరళస్వభావులు, కరగటానికి సిద్ధంగా వున్న మంచుగడ్డల వలె.
నిరాడంబరులు, చిత్రికపట్టని కొయ్యదుంగల వలె.
విశాలహృదయులు, కొండకింది మైదానాల వలె.
నిశ్చలులు, పంకిలమైన నీటికుంటల వలె.

కుంటల్లో నీరు తేటపడేదాక ఎవరు స్థిరంగా వేచి వుండగలరు?
క్రియాశీలురయ్యేదాక ఎవరు చలించకుండ వుండగలరు?
పథాన్ని అనుసరించేవారు పరిపూర్ణత్వంపై దృష్టి నిలుపరు.
పరిపూర్ణత్వం కోరరు గనుకనే, వారు మార్పుకోసం పరితపించరు.

# 16

మహా శూన్యతను సాధించు.
మనస్సును ప్రశాంతంగా వుంచు. అంతరంగంలో అవలోకించు.
అవి పెరుగుతవి. తరుగుతవి.
తిరిగి వాటి మూలాల్లోకి మరలుతవి.
మూలాల్లోకి మరలటం అంటే నిశ్చలత్వంలో కుదురుకోవటం.
ఇది ప్రకృతి ధర్మం.
ప్రకృతి ధర్మంలో మార్పుండదు.
మార్పులేని ప్రకృతి ధర్మాన్ని తెలుసుకోవటం
సునిశిత దృష్టికి సాధ్యమవుతుంది.

తెలుసుకోకపోవటం విపత్తుకు దారితీస్తుంది.
నిశ్చలతత్వాన్ని తెలుసుకొంటే, మనస్సు తెరుచుకొని
విశాలమౌతుంది.
విశాలమైన మనస్సు వుంటే హృదయం విశాలమౌతుంది.
హృదయం విశాలమైనప్పుడు, మనిషి అందరిలో
రాజులా ప్రవర్తిస్తాడు.
రాజులా వున్నవాడు, దైవాంశ కలిగివుంటాడు.
దైవాంశ కలిగినవాడు పథానువర్తి అవుతాడు.
పథానువర్తి శాశ్వతస్థితి పొందుతాడు.
ఆ స్థితిలో శరీరం రాలిపోయినా
పథం చాలా కాలం నిలిచివుంటుంది.

# 17

ఒకప్పుడు పాలకులున్న సంగతే ప్రజలకు తెలియదు.
తరువాత కాలంలో తెలుసుకొని ప్రశంసించటం చేశారు.
తరువాత భయపడి దూరంగా జరిగారు.
తరువాత అసహ్యించుకొన్నారు.

'ప్రజలను విశ్వసించక పోవటం మూలాన
వారు అబద్ధాలు చెప్పేవారుగా తయారవుతారు' అనే మాట నిజం.

జ్ఞాని నోటి నుండి ఏ విధంగాను ఒక్కమాట రాబట్టలేం.
తన కర్తవ్య నిర్వహణ పూర్తయాక
దేశంలో ప్రతి ఒక్కరు అంటారు, 'ఆ పని
దాని అంతట అదే జరిగింది' అని.

# 18

పథం క్షీణించినపుడు
దయ, నీతి మొలకెత్తుతవి.
పాండిత్యం, తెలివి పరిఢవిల్లినప్పుడు
కపటం కార్పణ్యం మొదలవుతవి.
కుటుంబంలో సఖ్యత కొరవడినప్పుడు
విధేయులైన కొడుకుల సంగతి చర్చకు వస్తుంది.
దేశం అల్లకల్లోలంగా వున్నప్పుడు
విశ్వసనీయులైన మంత్రుల గురించి తెలియవస్తుంది.

# 19

సన్యాసాన్ని, జ్ఞానాన్ని విడిచిపెట్టు.
అప్పుడది అందరికీ నూరురెట్లు మేలు చేస్తుంది.
దయను, న్యాయాన్ని వదలిపెట్టు.
అప్పుడు మళ్ళీ జనం విధేయంగా, దయగా వుంటారు.
నైపుణ్యం గురించి ఆలోచించకు. లాభార్జన పనిగా పెట్టుకోకు.
అప్పుడు దొంగలు దారిదోపిడీదారులు అదృశ్యమవుతారు.

ఈ మూడు కేవలం మాటల వరకే పరిమితం కాకుండా
వాస్తవికతను అవలంబించు.
ముఖ్యం ఏమంటే, సహజంగా జీవించటం.
స్వార్థాన్ని విడనాడటం.
వాంఛలను అణచటం.

## 20

చదువులు చాలించు. చింతలు తీరుతవి.
అవును, కాదు. వీటి మధ్య తేడా ఎంత వున్నది?
మంచి, చెడు. వీటి మధ్య దూరం ఎంత వున్నది?

'ఇతరులు భయపడేదాన్ని చూసి నేనూ భయపడాలి' అనే మాట
ఎంత అర్థం లేనిది!

బలి వుత్సవంలో పాల్గొంటూ
వసంతంలో కొండ శిఖరాలను ఎక్కుతూ
అందరూ ఆనందంగా నవ్వుతూ తుళ్ళుతూ వున్నారు.
నేనొక్కడినే ఇలా మొద్దులా
చిరునవ్వెరుగని పసిపాపలా వుండిపోయాను.
గమ్యం తెలియని ఒంటరివాడినైనాను.

సామాన్యులకు అవసరమైన దానికంటే అధికంగా వున్నది.
నా ఒక్కడికే ఏమీ లేదు.
నా తల మట్టిబుర్ర.
సామాన్యులు సైతం మేధానిధులు.

ఎగిసిపడే అలల కడలివలె
విరామమెరుగని ఝంఝూమారుతం వలె
సంక్షుభిత చిత్తం నాది.

మిగతా అందరూ తమ తమ పనుల్లో తీరిక లేకుండా వున్నారు.
నేనొక్కడినే లక్ష్యం లేకుండా, ఏ కోరిక లేకుండా వున్నాను.
నేను అందరిలా కాదు. వేరు మనిషిని.
పథము నా తల్లి.
ఆ తల్లి పెంచి పోషించిన పసిబిడ్డ నేను.

# 21

పథాన్ని అనుసరించటం ఒక్కటే
నైతిక ఉత్కర్షగల మానవుడు చేయవలసిన పని.
పథం మాటలకందదు. చేతికి చిక్కదు.
చేతికి చిక్కదు, మాటల కందదు, అయినా అందులో ఒక
ప్రతిబింబం వున్నది.
మాటల కందదు, చేతికి చిక్కదు, అయినా అందులో ఒక
ఆకారం వున్నది.
అది అస్పష్టం, చీకటి మయం. అయినా అది సారయుక్తమైనది.
ఈ సారం సత్యమైనది. అందులో విశ్వాసం గర్భితమై వున్నది.
సృష్టి ప్రారంభం నుండి పథం వుండనే వున్నది.
ఒక్క దాని ద్వారానే, సమస్త జీవుల సృష్టి క్రమం
నేటిదాకా తెలియబడుతోంది.

సృష్టి రహస్యం నాకెలా తెలిసింది అంటారా?
ఈ విధమైన సహజమార్గం ద్వారా.

# 22

కొరత వున్నది పూర్ణమౌతుంది.
వంకర వున్నది నిటారుగా అవుతుంది.
ఖాళీ అయినది నిండుకుంటుంది.
మాసినది కొత్తదవుతుంది.
స్వల్పం అనల్పమవుతుంది.
అధికం అనర్థ హేతువవుతుంది.

అందువల్ల జ్ఞాని
ఆ ఒక్క పథాన్నే ఆశ్రయించి దాని ప్రకారం ప్రతిదాన్ని పరిశీలిస్తాడు.
తనను తాను బహిర్గత పరచుకోడు.
అందువల్ల అంతటా అతని తేజస్సు ప్రకాశిస్తుంది.
తనెవరో ఏమిటో తను చెప్పడు.
అందువల్ల అందరిలో అతను ప్రముఖుడుగా గుర్తించబడతాడు.
గొప్పలు చెప్పుకోడు.
అందువల్ల అతని ఘనత అందరికీ తెలుస్తుంది.
చేసిన దానికి గర్వపడడు.
అందువల్ల ఆ పని పదికాలాల పాటు గుర్తుండిపోతుంది.
అతడు ఎవరితోను పోటీకి దిగడు.
అందువల్ల ఎవరూ అతనితో పోటీ పడజాలరు.

అందువల్ల "కొరత వున్నది పూర్ణమౌతుంది," అని మన పూర్వులు చేప్పేమాట వట్టిమాట కాదు.
సర్వసమగ్రమైన ప్రతి విషయాన్ని అది సూచిస్తుంది.

# 23

అతి వాగుడు మనిషికి సహజంగా అబ్బిన గుణం కాదు.
సుడిగాలి పొద్దంతా వీచదు.
గాలివాన రోజంతా కురవదు.
వీటిని కల్పించిందెవరు? భూమ్యాకాశాలు.
భూమ్యాకాశాలకే వీటిని స్థిరంగా వుంచటం చేతకానపుడు
మానవమాత్రుడి వల్ల ఏమవుతుంది?

పథాన్ని ఎవరు అనుసరిస్తారో వారు దానిలో ఒకటిగా
వుంటారు.
ఎవరు కర్తవ్య నిర్వహణలో నెగ్గుతారో వారు తమ విజయంలో
ఒకటిగా వుంటారు.
నెగ్గనప్పుడూ అపజయంతో ఒకటిగా వుంటారు.
జయాపజయాలు రెండింటిలో ఆనందం ఒకేలా అనుభవిస్తారు.

మనుషుల్ని నమ్మకుండా అనుమానిస్తుంటే
వారు అబద్ధాలకోరులుగా తయారవుతారు.

## 24

మునివేళ్ళ మీద నిలబడేవారు నిలకడగా వుండలేరు.
అంగలేసేవారు నిదానంగా నడువలేరు.
తమ ఘనతను తామే చాటుకొనేవారు జ్ఞానులు కాజాలరు.
తమకుతామే నీతిమంతులమనుకొనేవారు గౌరవం పొందలేరు.
ఆత్మస్తుతి చేసుకొనేవారు ఏదీ సాధించలేరు.
అహంకరించేవారు ఉన్నతస్థానం పొందలేరు.

కనుకనే పథాన్ని పాటించేవారు వీటిని లెక్కచేయరు.

## 25

భూమ్యాకాశాల కంటే ముందు
అనూహ్యమైనదేదో ఏర్పడి వున్నది.
అది ప్రశాంతబంధురమై, శూన్యమై వున్నది.
ఏకాంతంలో మార్పు లేనిదై వున్నది.
నిత్యం పరిభ్రమిస్తూ విసువు లేనిదై వున్నది.

బహుశా అది జగత్తులో సర్వ ప్రాణులకు మాతృమూర్తి.
పేరు నాకు ఎరుక లేదు గాని
పథమని పిలుద్దాము దాన్ని.
ఇంతకంటే గొప్ప పేరు లేదు గాన
మహత్తరమని అందాము.
మహత్తరమైనది గాబట్టి అది ముందుకు ప్రవహిస్తుంది.
చాలా దూరం ప్రవహిస్తుంది.
చాలా దూరం పోయి వెనుకకు మళ్ళుతుంది.

అందువల్ల "పథం మహత్తరమైనది.
ఆకాశం మహత్తరమైనది.
భూమి మహత్తరమైనది.
మానవుడు కూడా మహత్తరమైన వాడు."
విశ్వంలో ఈ నాలుగు మహత్తరమైన శక్తులు.
మానవుడు అందులో ఒకడు.

మానవుడు భూమిని అనుసరిస్తాడు.
భూమి ఆకాశాన్ని అనుసరిస్తుంది.
ఆకాశం పథాన్ని అనుసరిస్తుంది.
పథం, ప్రకృతి సహజస్థితిని అనుసరిస్తుంది.

# 26

లాలిత్యానికి మూలం గంభీరత.
కల్లోలానికి అధినేత ప్రశాంతత.

జ్ఞానులు దినమంతా ప్రయాణం చేసినా
సరుకులున్న సంచుల్ని జాగ్రత్తగా చూసుకొంటారు.
దార్లో చూడ తగ్గ ప్రదేశాలు ఎన్నివున్నా
ఆకర్షణలకు లోనుగాకుండా ముందుకు సాగుతారు.

పదివేల రథాలకు అధిపతి అయినవాడు
అందరి ఎడల తేలికగా ఎందుకు ప్రవర్తిస్తాడు?
తేలికగా ప్రవర్తిస్తే మూలం పోగొట్టుకొంటాడు.
తడబడితే అధికారం కోల్పోతాడు.

# 27

నేర్పుగల తెరువరికి బండ్లజాడలు కాలిగుర్తులు అక్కర లేదు.
నేర్పుగల వక్తకు పొగడ్తలు తెగడ్తలు అవసరం లేదు.
నేర్పుగల గణికునకు సరిచూసుకొనే పరికరాల అవశ్యకత లేదు.
ద్వారం బిగించటంలో నేర్పగల వానికి తాళంతో పని లేదు.
అట్టలు కుట్టటంలో నేర్పు వున్నవానికి ముడులు వేసే అవసరం రాదు.

జ్ఞానులు ప్రతి ఒక్కరినీ రక్షించటంలో నేర్పరులు.
వారు ఎవరినీ విడిచిపెట్టరు.
వారు ప్రతి విషయాన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తారు.
దేన్నీ అశ్రద్ధ చేయరు.
దీన్నే అంటారు 'వెలుగును అనుసరించటం' అని.

మంచి మనిషి అంటే ఎవరు?
చెడ్డవారికి వున్న ఏకైక ఏడుగడ.
చెడ్డ మనిషి అంటే ఎవరు?
మంచివారి రక్షణలో మనుగడ సాగించేవాడు.

ఒకడు ఎలాంటి వాడైనా కావచ్చు.
తన గురువును గౌరవించనప్పుడు
తన శిష్యుణ్ణి వాత్సల్యంతో చూడనప్పుడు
తప్పు చేసినవాడే అవుతున్నాడు.

ఇది అతిముఖ్యమైన, ఆశ్చర్యకరమైన విషయం.

# 28

పురుషుడి బలాధిక్యత ఎలాంటిదో తెలిసికొని కూడా
స్త్రీ లాలిత్యానికి రక్షణగా వుండేవాడు
నదులన్నీ వచ్చి చేరే లోయలాంటివాడు.
ఇది సమస్తమైన నైతిక ఉత్కర్ష, పథంలో కలవటం లాంటిది.
అతడు సుస్థిరము, నిత్య సత్యమై వున్నట్టి స్థితిలో
ఇంకోసారి పసిబాలుడిలా మారుతాడు.

తెలుపు తెలిసీ నలుపు వీడని వాడు
ప్రపంచానికి ఉదాహరణ పూర్వకంగా వుంటాడు.
ఉదాహరణ పూర్వకంగా, సుస్థిరంగా, నిత్యసత్యంగా వున్నవాడు
పరిపూర్ణ స్థితికి చేరుకొంటాడు.

గొప్ప గౌరవం పొందినప్పటికీ
వినయంగా వుండేవాడు దిగువన వుండే లోయను పొందుతాడు.
అతడు చెక్కబడని కొయ్యపలకలా దృఢస్థితికి మారుతాడు.

కొయ్య పలకను చెక్కినప్పుడు
అది నానా విధాలుగా ఉపయోగపడుతుంది.
జ్ఞాని ఉపయోగించినపుడు పాలకుడౌతాడు.
సామెత వుంది, “నిపుణుడైన దర్జీ కొద్ది కత్తెరలే వేస్తాడు.”

# 29

మొత్తం ప్రపంచాన్ని నీ ఆధీనంలోకి తీసుకొని
దాన్ని బాగుచేయవచ్చునని నీవు అనుకొంటున్నావా?
అది జరిగే పని అని నేననుకోను.
స్వతహాగా ప్రపంచం పరిపూర్ణమైనది, పవిత్రమైనది.
దాన్ని ఇంకా నీవు బాగు చేయలేవు.
దాన్ని నీవు మార్చాలని చూస్తే
అది పూర్తిగా చెడిపోయే ప్రమాదం వుంది.
దాన్నే పట్టుకుని వేళ్ళాడుతాను అంటే
చేజారిపోయే అవకాశం వుంది.

ప్రాణులు కొన్ని కొన్ని సందర్భాల్లో ముందుంటవి.
కొన్ని సందర్భాల్లో వెనుకబడతవి.
కొన్ని సమయాల్లో ఊపిరి పీల్చటం కష్టమౌతుంది.
కొన్ని సమయాల్లో తేలిక అవుతుంది.
ఒక్కొక్కప్పుడు బలం, ఒక్కొక్కప్పుడు బలహీనత వుంటుంది.
ఒకడు వృద్ధి పొందుతాడు. ఇంకొకడు క్షీణిస్తాడు.

అందువలన జ్ఞానులు మితిమీరి నడువరు.
విపరీతానికి పోరు.

## 30

పథం గురించి ఎప్పుడు నీవు పాలకులకు సూచనలిచ్చినా
బలాధిక్యంతో ప్రపంచాన్ని లొంగదీసుకోవద్దని వారికి నచ్చజెప్పు.
ఎందుకంటే అది ప్రతిఘటనను ప్రేరేపిస్తుంది.
సైన్యం విడిసిన చోట ముండ్ల చెట్లు మొలుస్తవి.
గొప్పయుద్ధం ముగిసిన వెనుక కరువు కాటకాలు తాండవిస్తవి.

ఏది ఎంతవరకు అవసరమో అంతవరకే చేయి.
అధికారం వుందిగదాని ఇష్టప్రకారం చెయ్యకు.

కార్య సాధకుడివి కా.
కార్య సాధనకు హింసను వాడకు.
ఆడంబరాలు ఆత్మస్తుతులు వద్దు.

బలప్రయోగం నిర్వీర్యతకు దారితీస్తుంది.
అది పథం పద్ధతి కాదు.
పథానికి ముప్పు తెచ్చేది ఏదయినా
త్వరలోనే పతనమౌతుంది.

# 31

ఆయుధాలు భయాన్ని కలిగించే సాధనాలు.
అంచేత అందరూ వాటిని అసహ్యించుకొంటారు.
పథాన్ని అనుసరించేవారు వాటితో సంబంధం పెట్టుకోరు.
జ్ఞానులు వామ భాగాన్ని, సైనికులు దక్షిణ భాగాన్ని ఎంచుకుంటారు.

ఆయుధాలు విపత్తుకు కారణాలు.
జ్ఞానులకవి ఉచితమైనవి కావు.
తప్పనప్పుడే వారు వాటిని వాడుతారు.
శాంతి సామరస్యాలకు వారు సర్వోత్కృష్ట స్థానమిస్తారు.

యుద్ధంలో విజయం సంతోషదాయకం కాదు.
యుద్ధంలో విజయం నీకు సంతోషదాయకమైతే
హత్యాకాండలో నీవు ఆనందానుభూతి చెందుతావన్నమాట.
హత్యాకాండలో నీవు ఆనందానుభూతి చెందితే
నీవు ఈ ప్రపంచంలో ఏ విషయంలోను పరిపూర్ణత చెందలేవు.

శుభ సమయాల్లో వామ భాగానికి ప్రాముఖ్యం వుంటుంది.
దుఃఖ సమయాల్లో దక్షిణ భాగానికి.
సైన్యంలో రెండో సేనాధిపతి వామ భాగాన వుంటాడు.
సర్వసైన్యాధ్యక్షుడు దక్షిణం వేపున.
దీని అర్థం, మృతులకు కర్మకాండ జరిపించడం ఎలాగో
యుద్ధం చెయ్యటం అలాగ అన్నమాట.

జనం అసంఖ్యాకంగా హత్య గావించబడ్డప్పుడు
హృదయం నిండుగా దుఃఖం పొర్లుకు రావాలి.
అందువల్ల యుద్ధంలో విజయం సాధించినప్పుడల్లా
దేశంలో సంతాప దినాలు ప్రకటించాలి.

# 32

నిత్యమైన పథము నామరహితమైనది.
చెక్కబడని కొయ్యదుంగ ముఖ్యమైనది కానట్లు అగుపించినా
ఆకాశం కింద వున్న వస్తువులన్నింటిలో అదే గొప్పది.
ప్రభువులు సామంతులు దాన్ని అవలంబించినట్లయితే
సర్వప్రాణులు తమంత తామే వారి ఆధిపత్యాన్ని అంగీకరిస్తవి.
భూమ్యాకాశాలు కూడబలుక్కొని మధురమైన మంచు కురిపిస్తవి.
ఏ చట్టము అవసరం లేకుండనే
జనులంతా సర్వసమానత్వం పాటిస్తారు.

కొయ్యదుంగ ఎప్పుడైతే చెక్కబడుతుందో
అప్పుడు పేర్లు ఏర్పడుతవి.
ఎప్పుడైతే పేర్లు ఏర్పడుతవో
ఇక ఆగవలసిన సమయం వచ్చిందని తెలుసుకోవాలి.
ఎప్పుడు ఆగవలెనో తెలిసినప్పుడు
మనిషి ప్రమాదం నుండి తప్పించుకొంటాడు.

పథము ప్రపంచానికి ఎటువంటిదంటే, వాగులు వంకలకు
నదులు సముద్రం ఎటువంటివో అటువంటిది.

# 33

ఇతరుల్ని తెలిసికొనటం తెలివి.
తనను తాను తెలిసికొనటం జ్ఞానం.
ఇతరుల్ని ఓడించేందుకు దేహబలం చాలు.
తనను తాను జయించుకొనేందుకు ఆత్మశక్తి అవసరం.

సంతృప్తి ఎరిగినవాడు ధనవంతుడు.
పట్టువిడువని వాడు దృఢ సంకల్పుడు.
తనకు నిర్ణయింపబడిన స్థానం నుండి ఎవడు చలించడో
వాడు సుస్థిరుడు.
మృత్యువు తరువాత కూడా ఎవడు నశించడో
వాడు దీర్ఘాయుష్మంతుడు.

## 34

పథము సర్వత్ర ప్రవహిస్తుంది. కుడికి, ఎడమకు.
అది సర్వ ప్రాణులకు ఆధారం. దేనినీ కాదనదు.
కర్తవ్యాన్ని శ్రద్ధగా నిర్వహిస్తుంది. కర్తృత్వాన్ని కోరదు.
సమస్తానికి నిలువనీడనిచ్చి పోషిస్తుంది.
అత్యల్పమైన దానితో దాన్ని పోల్చవచ్చు.
సమస్తమైన జీవరాశికి అది దిక్కు. కాని వాటిపై ప్రభుత్వం నెరపదు.
మహత్తరమైన దానితో దానిని లెక్కించవచ్చు.

కాని అది తన మహత్వాన్ని తానుగా చాటుకోదు.
కనుకనే అది మహత్తరమైనది.

# 35

పథము యొక్క మహత్తర మూర్తిని ఎవరు చేబూని వుంటారో
వారిని సమస్త ప్రపంచం ఆశ్రయిస్తుంది.
ఎందుకంటే అక్కడ శాంతిసౌఖ్యాలు నెలకొని వుంటాయి.

దారిని వెళ్ళే కొత్తవారిని, సంగీతమో, స్వాదు పదార్థమో
ఆగేట్టు చేయవచ్చు.
కాని, పథమును వర్ణించటానికి వున్న మాటలు వినినప్పుడు
నిస్తేజంగా, రసహీనంగా వినతగనివిగా అనిపించినప్పటికీ
ఆచరణలో పెట్టినపుడు, అది తరుగు లేనిదై
నిరంతర ప్రయోజనకారి అవుతుంది.

## 36

సంకోచించటానికి ముందు
వ్యాకోచం చెంది వుండాలి.
బలహీనుడివి అవాలి అంటే
ముందు నీవు బలవంతుడివి అయి వుండాలి.
కింద పడేయటానికి ముందు
పైకి లేపి వుంచాలి.
తీసికోదలిస్తే
ముందుగా ఇచ్చి వుండాలి.
ఇది తెలియటాన్నే జ్ఞానం అంటారు.

మెత్తదనం కాఠిన్యాన్ని జయిస్తుంది.
బలహీనత దృఢత్వాన్ని జయిస్తుంది.

చేపను నీటి నుండి బయటకు తీయరాదు.
దేశరక్షణకు వలసిన ఆయుధాల్ని బహిరంగపర్చరాదు.

## 37

పథము ఏమీ చెయ్యదు.
అయినప్పటికీ ఏదీ చెయ్యబడకుండా వుండదు.
అధికారంలో వున్నవారు దీన్ని అమలు పరిస్తే
పదివేల జీవరాశులు తమంత తామే వృద్ధి దిశగా
పరివర్తన చెందగలవు.
అటు తరువాత అవి క్రియవేపు మళ్ళితే
రూపరహిత  నిరాడంబరత ద్వారా అణిచివేయవచ్చు.
రూపం లేనపుడు కోరిక వుండదు.
కోరిక లేనప్పుడు ప్రశాంతత వుంటుంది.
ఈ విధంగా అన్నీ శాంతికి నిలయంగా వుంటవి.

# రెండవ భాగం

# 38

తాము మంచివాళ్ళమన్న సంగతి
నిజమైన మంచివాళ్ళకు తెలియదు.
అవివేకులు మంచిగా వుండేందుకు ప్రయత్నిస్తారు కనుకనే
వారు మంచివారు కారు.

నిజమైన మంచివాళ్ళు కర్మాచరణాసక్తులు కారు.
కాని వారి వల్ల ఏ పనీ చెయ్యబడకుండా వుండదు.
అవివేకులు ఎప్పుడూ ఏదో చేస్తూనే వుంటారు.
అయినా చేయవలసింది ఎంతో మిగిలిపోతూ వుంటుంది.

నిజమైన దయార్ద్రపరులు ఏ పని చేసినా కొరత లేకుండా చేస్తారు.
చట్టరీత్యా లెక్కప్రకారం చేసేవారు ఏది చేసినా
ఎంతో కొంత మిగిలిపోతుంది.
క్రమశిక్షణ అమలు పరచేవారు తమ మాట ఎవరూ వినకపోతే
చొక్కా చేతులు పైకి మడిచి దెబ్బలాటకు దిగుతారు.

పథం మరుగున పడినపుడు, మంచితనం బైటకు వస్తుంది.
మంచితనం మరుగున పడినపుడు, దయ
దయ మరుగున పడినపుడు, న్యాయం, చట్టం
న్యాయం, చట్టం మరుగున పడినపుడు కర్మకాండ బైటకు వస్తవి.

విశ్వాసం గట్టి గింజ అయితే కర్మకాండ పైపొట్టు లాంటిది.

అది గందరగోళానికి నాంది పలుకుతుంది.
జ్యోతిషం మీద నమ్మకం పైపై ఆడంబరం లాంటిది.
అది అవివేకానికి తొలిమెట్టు.

అందువల్ల నిజాయితీ పరులైన మహానుభావులు
ఏది సత్యమో దాన్ని గౌరవిస్తారు గాని పైపై మెరుగులు చూసికాదు.
చెట్టు పేరు చెప్పి కాయలమ్మే వారిని నమ్మరు.

# 39

ఇవి పూర్వం నుండి ఏకత్వాన్ని (పథమును) పొందినవి.
ఏకత్వాన్ని పొంది ఆకాశం ప్రకాశవంతమైంది.
భూమి స్థిరత్వాన్ని పొందింది.
దేవతలు శక్తిమంతులైనారు.
లోయలు పరిపూర్ణమైనవి.
అన్ని ప్రాణులు జీవవంతమైనవి.
రాజులు సామంతులు పాలనకు సమర్థులైనారు.
ఇది అంతా ఏకత్వము (పథము) వల్ల సాధ్యమైంది.

ఆకాశం ప్రకాశవంతం కాకపోతే
రెండుగా చీలిపోతుంది.
భూమి స్థిరత్వాన్ని పొందకపోతే విరిగి ముక్కలవుతుంది.
దేవతలు శక్తిమంతులు కాకపోతే కనుమరుగవుతారు.
లోయలు పరిపూర్ణం కాకపోతే ఎండి పూడిపోతవి.
ప్రాణులు జీవవంతం కాకపోతే నశించి పోతవి.
రాజులకు సామంతులకు పాలించే సమర్థత లేకపోతే
స్థానభ్రంశం చెందుతారు.

చిన్నపాటి వేరు నుండి మహావృక్షం పెరుగుతుంది.
ఉన్నతమైనదాని మూలం అధమమైన దాంట్లో వున్నది.

అందువల్లనే రాజులు సామంతులు తమనుతాము

అనాథలమని, ఏకాకులమని, ఏమీ లేనివారమని చెప్పుకొంటారు.
నమ్రతలోనే తమ బలం వున్నదని వారికి తెలుసు.

'బండి విడిభాగాలు లెక్కించినందువల్ల బండి స్వరూపం
గోచరం కాదు'
అనే మాటలో ఎంతో అర్థం ఇమిడి వుంది.

జ్ఞానులు పచ్చలా మెరవదలచరు.
గులకరాయిలా ఉండదలుస్తారు.

# 40

పథం యొక్క గతి తిరోగమించటం.
పథం యొక్క పద్ధతి బలహీనంగా వుండటం.
సమస్త ప్రాణులు జనించింది ఉనికి నుండి.
ఉనికి జనించింది లేమి నుండి.

# 41

ఉత్తమ మానవుడు పథం గురించి విన్నప్పుడు
ఆచరణలో పెట్టటానికి శాయశక్తులా ప్రయత్నిస్తాడు.
మధ్యముడు విని ఎటూ తేల్చుకోలేడు.
అధముడు విన్నంతనే హేళనగా నవ్వుతాడు.
నవ్వకపోతే అది పథం అనిపించుకోదు.

ఓ సామెత వుంది. 'వెలుతురు తోవ చీకటిగా అనిపిస్తుంది.
ముందుకు సాగే తోవ వెనుకకు మళ్ళినట్లు వుంటుంది' అని.

సమతలంగా వున్నది మిట్టపల్లాలతో వున్నట్లు అవుపిస్తుంది.
ఉన్నతమైన నీతివర్తనం నీచంగా భావించబడుతుంది.
తెల్లటి తెలుపు మరకతో వున్నట్టుగా
ఉత్కృష్టమైన గుణం లోప భూయిష్టమైనదిగా
దృఢమైన వ్యక్తిత్వం దుర్బలమైనదిగా
సహజవర్ణం వెలిసిపోయి వున్నట్లుగా తోస్తుంది.

మహా చతుర్భుజానికి కోణాలుండవు.
మహా పాత్ర తయారీకి బహుకాలం పడుతుంది.
మహత్తర సంగీతంలోని శబ్దం అసాధారణంగా వుంటుంది.
మహా విగ్రహం రూపరహితమై వుంటుంది.
పథం మరుగునపడి వుంటుంది. పేరు లేకుండా వుంటుంది.
సర్వ ప్రాణుల్ని పరిపోషించేది పథం ఒక్కటే.
అన్నింటికీ సర్వ సమగ్రత కలుగజేసేది కూడా అదే.

# 42

పథం ఒకటికి జన్మనిచ్చింది.
ఒకటి రెంటికి, రెండు మూటికి
జన్మనిచ్చింది.
మూడు పదివేల జీవరాశులకు జన్మనిచ్చింది.
ఈ పదివేల జీవరాశులు చీకటివెల్గుల కలయికగా వున్నవి.
ఈ రెండు వ్యతిరేక శక్తుల సంయోగం వల్ల
అవి సామరస్యస్థితిని పొందగల్గినవి.

అనాథస్థితి, ఏకాకితనం, నిస్సహాయత–
వీటిని ప్రజలు గర్హిస్తారు.
కాని జ్ఞానులు తమను తాము ఆ విధంగా చెప్పుకొంటారు.

పోగొట్టుకోవటం ద్వారా పొందటం జరుగుతుంది.
అందరూ ఏది చెబుతున్నారో నేనూ అదే చెబుతాను.
'హింసా ప్రవృత్తి గలవాడు మామూలు చావు చావడు.'
నా బోధల మూలసూత్రం ఇదే.

## 43

ప్రపంచంలోకెల్లా మిక్కిలి మృదువైన వస్తువు
మిక్కిలి కర్కశమైన దాన్ని జయిస్తుంది.
ద్రవ్య రహితమైనది రంధ్రంలేని తావున కూడా జొరబడుతుంది.
దీనివల్ల నేను తెలుసుకొన్నది ఏమంటే
నిష్క్రియ వల్ల ఉపయోగం వున్నదని.
మాటలు లేకుండా బోధించటం,
కార్యం లేకుండా లాభం పొందటం
ఈ రెండింటిని అర్థం చేసుకొన్నవారు అరుదు.

# 44

కీర్తి ప్రతిష్ఠలా, వ్యక్తిత్వమా, ఏది ముఖ్యం?
వ్యక్తిత్వమా, సిరిసంపదలా, ఏది ప్రధానం?
లాభమా, నష్టమా, ఏది బాధాకరం?

ఎంత ఎక్కువగా విషయలంపటులైతే
అంత ఎక్కువగా బాధ అనుభవిస్తారు.
ఎంత ఎక్కువ కూడ బెడితే
అంత ఎక్కువగా నష్టపోతారు.

ఉన్న దానితో తృప్తి పడేవారు ఎప్పటికీ నిరాశ చెందరు.
ఎంతలో వుండాలో అంతలో వున్నవారు అపాయం ఎరుగరు.
అలాంటివారు ఎల్లప్పుడు సురక్షితంగా వుంటారు.

# 45

మిగుల నిర్దుష్టమైన దాంట్లో లోపం వున్నట్లు అనిపిస్తుంది.
అయినా అది ఎంత వాడినా అరగదు.
పరిపూర్ణమైన దాంట్లో శూన్యం వున్నట్లు అనిపిస్తుంది.
అయినా అది ఎంత వాడినా తరగదు.
అత్యంత సరళమైన దాంట్లో వంకర వున్నట్లు అనిపిస్తుంది.
గొప్ప వాక్చాతుర్యం అసంబద్ధంగా వున్నట్లు అనిపిస్తుంది.

కదలిక వల్ల చలి సమసిపోతుంది.
స్తబ్దత వల్ల వేడి ఆగిపోతుంది.
జ్ఞాని తన శుచిత్వం చేత, ప్రశాంతత చేత
లోకంలో క్రమపద్ధతి నెలకొల్పుతాడు.

# 46

భూమ్మీద పథం రాజ్యం చేసే కాలంలో
గుర్రాల్ని ఎరువుకోసం పొలాల్లో కట్టి వుంచేవారు.
భూమ్మీద పథం అంతరించినప్పుడు
గుర్రాల్ని యుద్ధం కొరకు వూరి బయట పాకల్లో మేపుతున్నారు.

లోభాన్ని మించిన పాపం వేరొకటి లేదు.
అసంతృప్తిని మించిన శాపం గాని
స్వార్థాన్ని మించిన దురదృష్టం గాని మరోటి లేదు.
అందువల్ల ఉన్నది చాలు అని ఎవరు అనుకొంటారో
వారికి ఎప్పుడూ సరిపడినంత వుంటుంది.

# 47

గుమ్మం దాటి వెళ్లకుండానే మొత్తం ప్రపంచాన్ని అర్థం చేసుకోవచ్చు.
కిటికీలోంచి తొంగి చూడకుండానే అంతరిక్షాన్ని శోధించవచ్చు.
దూరం వెళ్ళే కొద్దీ అంతుబట్టేది తక్కువ.

అందువలన జ్ఞాని వున్న చోటనే వుండి అన్నీ తెలుసుకొంటాడు.
దృష్టి పెట్టకుండానే అన్నింటినీ దర్శిస్తాడు.
నిష్క్రియాపరుడై సమస్తం సాధిస్తాడు.

# 48

విద్యాభ్యాసం చేసేప్పుడు, రోజూ కొంత కొంత విషయజ్ఞానం
చేకూరుతుంది.
పథం అవలంబించటం వల్ల రోజూ కొంత కొంత తరుగుతుంది.
చేసేది ఏమీ లేకుండేంత దాకా తగ్గించుకొంటూ వెళ్ళు.
ఏమీ చేయకుండా వుంటే, చేయబడంది ఏదీ వుండదు.

దేంట్లోనూ జోక్యం చేసుకోకుండా వుంటే
ప్రపంచంలో అన్నీ సక్రమంగా నడుస్తవి.

# 49

జ్ఞానులు గిరిగీసుకొని అందులో కూర్చోరు.
ప్రజల మనస్సులను తెలిసికొని అందుకు అనుగుణంగా స్పందిస్తారు.

జ్ఞాని అంటాడు, 'నేను మంచి వాళ్ళతో మంచిగా వుంటాను.
మంచివాళ్ళు కానివాళ్ళతో కూడా మంచిగా వుంటాను.
నైతిక ఉత్కర్ష అంటే మంచితనం కనుక
నమ్మకంగా వుండే వారి పట్ల నమ్మకంగా వుంటాను.
నమ్మకంగా లేనివారి పట్ల కూడా నమ్మకంగా వుంటాను.
నైతిక ఉత్కర్ష అంటే నమ్మకం కనుక.'

జ్ఞానులు ఏకాంత వాసులు, వినయ స్వభావులు.
వారు అచ్చం చిన్నపిల్లల్లాంటివారు.
ప్రపంచానికి అస్సలు అర్థం కారు.
అయినప్పటికీ జనం వారి వంకే చూస్తారు.
వారి మాటలే వింటారు.

## 50

చావు పుట్టుకల నడుమ
పదిమందిలో ముగ్గురు జీవ అనుగాములు వుంటారు.
మృత్యువు నుండి జీవనానికి ప్రయాణించే వారిలో కూడా
పదిమందిలో ముగ్గురే.
ఎందువల్ల ఇది?
ఎందుకంటే వారు జీవితం స్థూల భూమిక మీద జీవిస్తున్నారు.

జీవించటం ఎలాగో తెలిసినవారు భూమ్మీద నడిచేటప్పుడు
ఖడ్గమృగాలకు పులులకు భయపడరు.
వాళ్ళు యుద్ధంలో గాయపడరు.
ఎందుకంటే ఖడ్గమృగం కొమ్ము దిగబడటానికి
వాళ్ళ ఒంట్లో చోటుండదు.
పులి పంజా విసరటానికి వాళ్ళ ఒంట్లో చోటు వుండదు.
ఎందుకని?
ఎందుకంటే, వాళ్లలో మృత్యువు ప్రవేశించటానికి
చోటుండదు గనుక.

# 51

పథము సమస్త ప్రాణకోటికి జన్మకారకమైంది.
పథము వాటిని పరిపోషిస్తుంది.
జాతికి తగ్గట్టు రూపం ఏర్పరుస్తుంది.
సహజశక్తికి పరిపూర్ణత కలుగజేస్తుంది.

కనుక సమస్త ప్రాణకోటి పథమును గౌరవిస్తుంది.
గుణాతిశయాన్ని ఉగ్గడిస్తుంది.
పథమును గౌరవించటం, గుణాతిశయాన్ని ఉగ్గడించటం
బలవంత పెట్టి చేయించుకొనే పనులు కావు.
అవి వాటంతట అవి సహజసిద్ధంగా జరిగే పనులు.

అందువల్ల, పథమునుండే సమస్తము ఆవిర్భవిస్తుంది.
గుణాతిశయం వాటిని పరిపోషించటం,
వృద్ధిపొందించటం, రక్షించటం, ఆశ్రయం ఇవ్వటం చేస్తుంది.

సృష్టిస్తుంది, అనుభవించదు.
కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. ఫలాన్ని ఆశించదు.
మార్గదర్శకత్వం చేస్తుంది. ఆధిపత్యం నెరపదు.
రహస్యమయ శక్తి అని దీన్నే అంటారు.

# 52

దృశ్యమాన ప్రపంచానికో ప్రారంభదశ వుంది.
ప్రారంభదశ ప్రపంచంలోని సమస్త జీవరాశులకు తల్లివంటిది.
తల్లిని తెలుసుకొంటే, బిడ్డల్ని తెలుసుకోవటం తేలిక అవుతుంది.
బిడ్డల్ని తెలుసుకొని తల్లి అండ విడువకుండా వున్నవారు
మృత్యు భయం నుండి బయటపడతారు.

ఇంద్రియ ద్వారాలు మూసి వుంచితే
శరీరగత ప్రాణశక్తి జీవితాంతం సన్నగిలదు.
ఇంద్రియ ద్వారాలు తెరిచి ఎల్లప్పుడు
కార్యాచరణలో తీరిక లేకుండా గడిపితే
బ్రతుక్కి అర్థం లేకుండా పోతుంది.

చిన్న వస్తువుల్ని సైతం చూడగలగటం నిశిత దృష్టికి నిదర్శనం.
బలహీనతను అంటిపెట్టుకొని వుండటం బలాధిక్యతకు లక్షణం.
బాహ్యదృష్టి సాయంతో ఎవరు అంతర్ దృష్టికి మరలుతారో
వారు ప్రాపంచిక రుగ్మతలకు లోనుకారు.

దీన్ని నిత్య వస్తువును సాధన చేయటం అంటారు.

## 53

నాకు ఏమాత్రం ఇంగితజ్ఞానం వున్నా
నేను చక్కటి రాజమార్గాన్ని ఎన్నుకుంటాను.
నాకున్న భయం అల్లా దారి తప్పుతానేమో అని.
రాజమార్గం మీద నడక సులభమే అయినా
జనం సందులు గొందులు వెదుకుతారు.

పొలాలు కలుపు మొక్కలతో నిండి వుంటవి.
గాదెల్లో ధాన్యం అడుగంటుతుంది.
అలాంటప్పుడు ప్రభువుల దర్బారు ఆడంబరాలతో
విర్రవీగుతుంటుంది.
కొందరు ఖరీదైన అంగీలు ధరిస్తారు.
మొలకు విచ్చుకత్తులు కడతారు.
మితిమీరి తినటం తాగటం చేస్తారు.
అవసరాన్ని మించి ఆస్తులు కూడ బెడతారు.

వీరు సమాజంలో పై తరగతికి చెందిన దోపిడీదారులు.
నిశ్చయంగా ఇది పథానికి బహుదూరం.

## 54

స్థిరంగా నాటుకొన్న దాన్ని పెకలించటం సులువు కాదు.
దృఢంగా పట్టుకొన్న దాన్ని వూడ బెరకటం సాధ్యం కాదు.
పథం యొక్క నైతిక ఉత్కర్ష వల్ల పూర్వుల యజ్ఞ కర్మలు
తరతరాలు నిరాఘాటంగా సాగుతవి.

పథాన్ని ఒకడు తన జీవితంలో ఆచరించితే
దాని గుణం నిర్దుష్టమై వుంటుంది.
కుటుంబంలో ఆచరించితే
దాని గుణం ద్విగుణీకృత మౌతుంది.
గ్రామంలో ఆచరించితే
దాని గుణం అధికతరమౌతుంది.
దేశం మొత్తంలో ఆచరించితే
దాని గుణం విశ్వజనీనమై వరలుతుంది.

ఎందుకంటే,
ప్రతి వ్యక్తి ఇతరులను తన వ్యక్తిగత దృష్టి నుండే చూస్తాడు.
కుటుంబ దృక్పథం నుండి ఇతర కుటుంబాల్నీ
గ్రామ దృక్పథం నుండి ఇతర గ్రామాల్నీ
రాష్ట్ర దృక్పథం నుండి ఇతర రాష్ట్రాల్నీ
దేశం దృక్పథం నుండి ఇతర దేశాల్నీ చూస్తాడు.

దేశం ఇట్లా వుంటుందని నాకెట్లా తెలుసు?
ఇందువల్లనే.

# 55

పథ లక్షణాలు పూర్తిగా ఒంటబట్టించుకొన్న వ్యక్తి శిశువుతో సమానం.
ఆ శిశువును విష కీటకాలు కుట్టవు.
క్రూర మృగాలు కోరల్తో చీల్చవు.
వేట పక్షులు గోర్లతో రక్కవు.

శిశువు అస్థికలు బలహీనంగా, స్నాయువులు మెత్తగా వున్నా
పిడికిలి దృఢంగా వుంటుంది.
స్త్రీ పురుష సంయోగానుభవం లేకపోయినా
పురుషాంగం చలిస్తుంది.
అందుకు కారణం, దాని వీర్యశక్తి సంపూర్ణంగా వుండటం.
రోజంతా గీపెట్టి అరచినా గొంతు బొంగురు పోదు.
కారణం స్వరమాధుర్యం ఉత్కృష్టంగా వుండటం.
అవయవాల అమరిక పొందికగా ఏర్పడటం.

సృష్టిలో పొందికగా వున్న అమరికను అర్థం చేసుకోవటం అంటే
పథం యొక్క స్థిరత్వాన్ని తెలుసుకోవటం.
స్థిరత్వాన్ని తెలుసుకోవటం అంటే జ్ఞానానికి పెద్దపీట వేయటం.

జీవన వ్యాపారాన్ని శక్తికి మించి వృద్ధి చేసుకొనే కళలన్నీ
విపత్తుకు దారి తీస్తవి.
శ్వాసను నియంత్రించబూనటం మితిమీరిన శ్రమ అవుతుంది.
మితిమీరిన శ్రమ, శక్తి హీనతకు కారణమౌతుంది.
పథ నిర్దేశానికి విరుద్ధమైనదెల్లా శీఘ్రచ్యుతి పొందుతుంది.

# 56

తెలిసినవారు మాట్లాడరు.
మాట్లాడే వారికి తెలియదు.
నోటిని అదుపులో వుంచుకొని
ఇంద్రియాల్ని అరికట్టాలి.
తీవ్రతను  తగ్గించుకొని
చిక్కుల్ని విడదీయాలి.
మిరుమిట్లు గొలిపే కాంతిని
మందగింపజేయాలి.
నేలమీద దుమ్ము కణాలలో
ఒకడివిగా అవాలి.

దీన్ని రహస్యమయ సమత్వం అంటారు.

ఇలాంటి స్థితి ఎవరు అందుకుంటారో
వారు మిత్రుల్ని శత్రువుల్ని
మంచిని చెడుని గౌరవాన్ని పరాభవాన్ని ఒకేలా చూస్తారు.
వారు గదా సమస్త ప్రపంచంలో ఉత్తములు.

# 57

‘నియమాలు పాటించినప్పుడే రాజ్యాలు పాలించటం సులువవుతుంది.
నియమాలు ఉల్లంఘించినప్పుడే యుద్ధాలు గెలవటం వీలవుతుంది.’
ప్రపంచంలోని సర్వప్రాణుల విధేయతను నిష్క్రియ వల్లనే పొందవచ్చు.
ఇది నాకెలా తెలిసింది? ఇదిగో ఇందువల్ల.

చట్టాలు ఆంక్షలు ఎంతగా ఎక్కువైతే
ప్రజలు అంతగా బీదవారు అవుతారు.
ప్రజల దగ్గర ఆయుధాలు ఎంత ఎక్కువ పదునైనవి వుంటే
అంత ఎక్కువగా దేశంలో సంక్షోభం పెరుగుతుంది.

ఎంత ఎక్కువగా ప్రజలు తెలివిమీరి వుంటారో
అంత ఎక్కువగా వింత సంఘటనలు జరుగుతాయి.
చట్టాలు ఆదేశాలు ఎన్ని ఎక్కువగా చలామణిలోకి వస్తే
అంత ఎక్కువగా దొంగలు, దోపిడీదారులు పెరుగుతారు.

అందువల్ల జ్ఞాని అంటాడు:
‘నేను నిష్క్రియాపరుడనై వున్నంత దాక ప్రజలు సభ్యతగా నడుచుకొంటారు.
నేను శాంతి ఆపేక్షించినంతదాక ప్రజలు నిజాయితీతో వుంటారు.
నేను ఏమీ చెయనప్పుడు, ప్రజలు భాగ్యవంతులవుతారు.
నాలో ఏ కోరికలు లేనపుడు, ప్రజలు మంచికి,
సామాన్య జీవనానికి మరలుతారు.’

# 58

అసమర్థ పాలన అనిపించుకొన్నది
ఒక్కోసారి ప్రజలకు చాలా మేలు చేస్తుంది.
సమర్థ పాలన అనిపించుకొన్నది
ప్రజలకు కీడు చేసి నిరాశ మిగులుస్తుంది.

దౌర్భాగ్యం పక్కనే సౌభాగ్యం వుంటుంది.
సౌభాగ్యం, దౌర్భాగ్యం కిందనే నక్కి వుంటుంది.
ఎవరికి తెలుసు, ఏది ఎలా అంతమౌతుందో?

నిజాయితీకి రోజులు చెల్లినవి.
నిజాయితీ కపటరూపం దాల్చింది.
మంచితనం భ్రమాన్వితమైంది.
ప్రజలకున్న భ్రమ ఇంతలో దిగిపోదు.

జ్ఞానుల తెలివి తీక్షణంగా వుంటుంది గాని గాయపర్చదు.
కోసు తేలి వుంటుంది గాని గుచ్చుకుపోదు.
సూటిగా వుంటుంది గాని అదుపు తప్పదు.
ప్రకాశవంతంగా వుంటుంది గాని మిరుమిట్లు గొల్పదు.

## 59

ప్రజల్ని పాలించటానికి, స్వర్గాన్ని సేవించటానికి
మితంగా వుండటం కంటే ఉత్తమమైనదేదీ లేదు.
పథాన్ని ఆచరణయోగ్యం చెయ్యటానికి
ముందు మితాన్ని పాటించాలి.
పూర్వం మనం కూడబెట్టుకున్న నైతిక ఉత్కర్ష మీద
ఇది ఆధారపడి వుంది.
నైతిక ఉత్కర్ష వుంటే సాధ్యం కానిదేదీ లేదు.
ఎవనికి సాధ్యంకానిదేదీ లేదో,
అతని శక్తికి హద్దులు వుండవు.
ఎవని శక్తికి హద్దులుండవో
అతడొక రాజ్యాధినేత అవటానికి సమర్థుడవుతాడు.
అట్టి రాజ్యార్హత ఎవనికి వున్నదో అతడు రాజ్యశ్రీని
బహుకాలం పోషించగలడు.

లోతుగా నాటుకొన్న వేరు, దృఢంగా కట్టిన పునాది
చాలానాళ్ళు మన్నుతవి.

# 60

పెద్ద రాజ్యాన్ని పాలించటం అంటే చిన్న చేపను వండటం లాంటిది. ఏ జ్ఞానులు పథాన్ని అంటిపెట్టుకొని వున్నారో, వారు ప్రపంచాన్ని తమలో వున్న చెడ్డశక్తిని పైకి ప్రదర్శించకుండా పాలించగలిగారు. చెడ్డశక్తిని పైకి ప్రదర్శించకపోవటమే కాదు, తమలో వున్న మంచిశక్తి వల్ల ప్రజలకు అపకారం జరగకుండా చూశారు. జ్ఞానులు కూడా అపకారానికి లోనవకుండా వుండగలిగారు. ఆ విధంగా ప్రతివారు రక్షించబడటం మూలాన వారి వారి శక్తులన్నీ ఒక ప్రయోజనం కొరకు ఏకముఖీనమయినవి.

## 61

పెద్దరాజ్యం పల్లపు భూమిలా
అన్ని నదులు ఆ దిక్కుకు ప్రవహించేటట్టుగా వుండాలి.
ఆకాశం కిందవన్నీ అక్కడ కలుసుకొనే కేంద్ర బిందువులా
అది వుండాలి.
అన్నింటితో అది నడుచుకొనే తీరు
స్త్రీ పాత్రను పోలి వుండాలి.
స్తబ్దంగా అణిగి వుండి స్త్రీ పురుషుణ్ణి జయిస్తుంది.
అందువల్ల పెద్ద రాజ్యం తగ్గివుంటే
చిన్న రాజ్యాన్ని జయించగలుగుతుంది.
చిన్న రాజ్యం తగ్గివుంటే
పెద్ద రాజ్యాన్ని జయించగలుగుతుంది.
జయం పొందదలచినవాళ్లు తగ్గి వుండాలి.
తగ్గి వున్న వాళ్ళు జయిస్తారు.

పెద్దరాజ్యానికి మనుషులు ఎక్కువమంది కావలసివస్తారు.
చిన్న రాజ్యం సేవలందించాలి.
అప్పుడు ప్రతి ఒక్కటీ అది కోరుకొన్నది పొందగలుగుతుంది.
పెద్దరాజ్యం అణిగి వుండటం తగు విధంగా వుంటుంది.

## 62

పథము సమస్త జీవరాశులకు మూలము.
గుణమునకు భాండాగారము. గుణములేని దానికి ఆశ్రయము.

మంచిమాటలు గౌరవాన్ని తెస్తవి.
మంచి పనులు ఆధిక్యాన్ని ఇస్తవి.

మనుషులు మంచి వాళ్ళు కాకపోయినా,
వాళ్ళను దూరం చేసుకోవద్దు.

కనుక, చక్రవర్తి పట్టాభిషిక్తుడైన రోజున గాని
ముగ్గురు ఉన్నతాధికారులు నియమింపబడిననాడు గాని
వాళ్ళకు విలువైన పచ్చనో, ఉత్తమాశ్వాలనో
బహుమానంగా పంపించే కంటే
కదలకుండా కూర్చొని పథాన్ని నివేదించు.

పూర్వులు పథం ఇంత విలువైనదని ఎందుకన్నారు?
దీని ద్వారా అన్వేషించినది లభ్యమవుతుందనీ
పథమును కాదన్నవారు కూడ క్షమార్హులవుతారనీ అనలేదా?

ఆ కారణంగానే, ఇది అమూల్యమైనదని లెక్కింపబడింది.

# 63

ఏ పని అయినా, 'చేస్తున్నాను' అనే ఆలోచన లేకుండా చేయి.
కష్టం అనుకోకుండా కష్టపడు.
రుచిలేని దాన్ని రుచి చూడు.
అల్పమైన దాన్ని అధికమైన దానిగా
కొద్దిగా వున్న దాన్ని, ఎక్కువైన దానిగా భావించు.
కీడు చేసిన వానికి మేలు చేయి.

క్లిష్టమైన దాంట్లో సుసాధ్యమైన దాన్ని చూడు.
చిన్న విషయాల్లో గొప్పతనాన్ని సాధించు.

ప్రపంచంలో కష్టమైన పనులన్నీ
అవి తేలికైనవి అన్నట్లుగా నిర్వహించబడ్డవి.
చిన్న పనులన్నీ కలిసి ఘనకార్యాలయ్యాయి.

# 64

నిలకడగా వున్న దాన్ని సులభంగా పట్టవచ్చు.
లక్షణాలు బయట పడకముందే పరిస్థితిని తేలికగా
అదుపు చేయవచ్చు.
పెళుసుగా వున్నప్పుడే దేన్నైనా సులువుగా పగలగొట్టవచ్చు.
చిన్నగా వున్న దాన్ని చిటికెలో చెల్లాచెదరు చేయవచ్చు.
ఏదైనా రూపొందక ముందే క్రియ మొదలుపెట్టు.
క్రమభంగం కాకముందే క్రమంలో వుంచు.

చిన్న మొలక నుండే చేతులకందనంత పెద్ద వృక్షం పెరిగింది.
తొమ్మిదంతస్తుల భవనం గుప్పెడు మట్టికుప్ప నుండే లేచింది.
వేయి ఆమడల ప్రయాణం పాదం కింద మట్టినుండే మొదలయింది.

కర్మాసక్తుడు తన పనిని తానే చెడగొట్టుకొంటాడు.
దేన్ని గట్టిగా పట్టుకొంటాడో, దాన్ని జారవిడుచుకొంటాడు.
కనుక, జ్ఞాని కర్మణ్యుడు కాడు. అందువల్ల చెడగొట్టడు.
దేన్నీ గట్టిగా పట్టుకోడు. అందువల్ల ఏదీ జారిపోదు.

లౌకికజనం చివరిక్షణంలో వాళ్ళ కార్యాన్ని చెడగొట్టుకొంటారు.
ప్రారంభానికి ఎంత ప్రాధాన్యత ఇస్తావో
అంతానికి అంత ప్రాధాన్యం ఇవ్వు. అప్పుడు ఏ కార్యం
కుంటు వడదు.

ఏమీ కోరకుండా వుండటమే జ్ఞాని లక్ష్యం.

కష్టసాధ్యమైన వస్తువుల్ని అతడు ఆశించడు.
ఇతరులు తెలిసికోని దాన్ని అతడు తెలుసుకొంటాడు.
సృష్టిలో సమస్త వస్తుజాలం సహజక్రమాభివృద్ధిని అతడు
కోరుకొంటాడు.

కాని చర్యాచరణకు ముందుకు వురకడు.

## 65

పథాన్ని అనుసరిచటంలో నేర్పరులైన పూర్వులు
ప్రజలకు దాని గురించిన జ్ఞానం అందించే బదులు
వారిని ఇంకా అవివేకులుగా తయారు చేశారు.

ప్రజల్ని పాలించటం కష్టం ఎందుకవుతుందంటే
వాళ్ళు మితిమీరిన తెలివితేటలు కలిగి వుండటం వల్ల.
ప్రజల్ని తెలివితేటలు ఉపయోగించి పాలించేవాడు
దేశాన్ని మోసగించేవాడు అవుతాడు.
అలాకాని వాడు దేశానికి వరం అవుతాడు.
ఈ రెండింటిలో వున్న తేడాను కనిపెట్ట గలగటం
అలౌకిక గుణ సంపద.
అలౌకిక గుణ సంపద గంభీరమైనది, సర్వత్రా వ్యాప్తి గలది.
అన్నింటిని ఏకరూపస్థితికి తీసుకురాగలది.

## 66

నూరు నదులకు సముద్రం రాజు ఎలా కాగలిగింది?
ఎలా అంటే అది వాటికంటే దిగువన వుంది కాబట్టి.

జ్ఞాని ప్రజలకంటే పైన వుండదలిస్తే
మాటల్లో దిగువన వుండాలి.
వారిని నడిపిస్తూ ముందు వుండవలెనంటే
అందరి వెనుక నిలబడాలి.

అట్లా జ్ఞాని పైన వుంటాడు. ప్రజలకతని భారం తెలియకుండా
వుంటుంది.
అతడు ముందు వుంటాడు. ప్రజలకతని స్థితి కష్టం కలిగించదు.

అతడు వెనుక వుండి ముందుకు తోస్తుంటే
సంతసిస్తారు గాని ఆయాసపడరు.

అతను తీవ్రంగా ప్రయత్నించడు గాబట్టి
అతడితో సమానంగా ఎవరూ ప్రయత్నించలేరు.

# 67

లోకులంటారు, 'నా పథం గొప్పదే గాని సంప్రదాయానికి విరుద్ధంగా వుంది' అని
అవును, గొప్పది కాబట్టే సంప్రదాయానికి విరుద్ధంగా వున్నది.
సంప్రదాయబద్ధంగా వుండి వుంటే అది ఎప్పుడో అంతరించి వుండేది.

నా వద్ద మూడు నిధులు సురక్షితంగా వున్నవి.
ఒకటి క్షమ, రెండు సంయమం, మూడు,
అందరికంటే ముందు వుండాలనే తెంపరితనం నాకు లేకపోవటం.
క్షమ ధైర్యాన్నిస్తుంది. సంయమం ఉదారస్వభావాన్నిస్తుంది.
అందరిలో ముందు వుండాలనే తెంపరితనం నాకు లేకపోవటం వల్ల
అందరిలో ప్రధానుడనై వున్నాను.

ఈ కాలంలో మనుషులు క్షమను వీడి సాహసం చూపెట్టాలనుకొంటున్నారు.
చివరి స్థానాన్ని వీడి మొదటి స్థానాన్ని ఆక్రమించాలనుకొంటున్నారు.
ఇంతకంటే మృత్యు సదృశం ఇంకోటి లేదు.

క్షమ యుద్ధంలో విజయాన్ని తెస్తుంది.
ఆత్మరక్షణ కలిగిస్తుంది.

ఆకాశం ఎవరిని రక్షించాలనుకొంటే
వారిని క్షమ ద్వారా రక్షిస్తుంది.

## 68

ఉత్తమ సేనాపతి హింసాప్రవృత్తి కలిగి వుండడు.
నిపుణుడైన పోరాట వీరుడు కోపం ప్రదర్శించడు.
నేర్పరి అయిన విజేత ప్రతీకారానికి పాల్పడడు.

పనికోసం మనుషులను వాడుకోగలిగిన వాడు
వారికంటే తక్కువగా కనిపిస్తాడు.

తీవ్ర ప్రయత్నం చేయనప్పుడు కలిగే శక్తి ఇది.
మనుష్యులను చక్కగా వినియోగించుకోవటానికి పనికొచ్చే శక్తి ఇది.
ఈ విధంగా చేయటం ఆకాశశక్తికి అనుగుణంగా ప్రవర్తించటం అని
పూర్వకాలం నుండి మనిషికి తెలుసు.

## 69

సైనిక పటాలంలో ఒక సామెత వుంది.
'నేను అతిథిగా వుండ దలుస్తాను గాని,
అతిథిని ఆదరించే వానిగా కాదు.'
అంటే ఏమిటి? 'యుద్ధంలో తొందరపడి ముందుకు
చొచ్చుకు పోకుండా
ఆత్మరక్షణకు ప్రాధాన్యం ఇస్తాను' అని.
ఒక అంగుళం ముందుకు వెళ్ళే బదులు
ఒక అడుగు వెనుకకు వేస్తాను.

దీన్ని అంటారు. 'కదలకుండా ముందుకు వెళ్ళటం' అని.
ముంజేయి చూపకుండా చొక్కా చేయి పైకి మడవటం.
తలపడకుండా శత్రువుని బంధించటం.
లేని కత్తిని పైకి దూయటం.

శత్రువుని తక్కువ అంచనా వేయటం కంటే
అధికమైన విపత్తు లేదు.
శత్రువుని తక్కువ అంచనా వేస్తే
దక్కిన నిధుల్ని జారవిడిచినట్లు అవుతుంది.

అందుచేత ప్రత్యర్థులు తలపడినప్పుడు
వెనుకంజ వేసేవాడు జయిస్తాడు.

## 70

నా మాటలు సులభంగా బోధపడుతవి.
వాటిని ఆచరణలో పెట్టడం సులువు.
కాని, ఇంత ప్రపంచంలో వాటిని తెలిసి ఆచరించగలవారు అరుదు.

నా మాటలు సనాతనమైనవి.
నా చేతలు నియమబద్ధమైనవి.
అవి ఏవీ ప్రజలకు అర్థం కావు గనుక
నేనెవరో వారికి తెలియదు.

నన్ను అర్థం చేసుకొన్నవారు ఒకరిద్దరు.
నా ఆదర్శం ప్రకారం నడుచుకొనేవారు ప్రశంసాపాత్రులు.

జ్ఞాని ముతక కంబళి కప్పుకొంటాడు.
హృదయంలో మేలి పచ్చను దాచుకొంటాడు.

## 71

తెలియదని తెలియటం గొప్ప విషయం.
తెలియకపోయినా తెలుసుననుకోవటం వెర్రితనం.

ఎవడు రోగాన్ని రోగంగా గుర్తిస్తాడో
వాడు రోగం నుండి బైట పడతాడు.

జ్ఞాని రోగగ్రస్తుడు కాడు.
ఎందుకంటే అతడు రోగాన్ని రోగంగా గుర్తిస్తాడు.
అందువల్ల అతడు రోగరహితుడైనాడు.

# 72

నీ శాసనానికి ప్రజలు భయకంపితులు కాకపోతే వచ్చే నష్టం ఏమీ లేదు. అంతకంటే పైనున్న పెద్ద శాసనం వాళ్ళ సంగతి చూసుకొంటుంది. వాళ్ళ ఇళ్ళలో కాలుపెట్టకు. వాళ్ళ బ్రతుకు చిందర వందర చేయకు. వాళ్ళ బ్రతుకుల్ని చిందరవందర చెయ్యని ఒక్క కారణానికే వారు నిన్ను అసహ్యించుకోకుండా వుంటారు. జ్ఞానికి తానెవరో తనకు తెలుసు. అయినా బయట పడడు. తన విలువేంటో తనకు తెలుసు. అయినా అతిశయం చూపడు. నిజానికి అతడు 'దాన్ని కాదని దీన్ని స్వీకరిస్తాడు.'

# 73

ధైర్యస్థుడు ఉద్రేక స్వభావి అయితే ప్రాణం తీస్తాడు.
ధైర్యస్థుడు శాంతమూర్తి అయితే ప్రాణం పోస్తాడు.

ఇద్దరిలో ఎవరు మంచి ఎవరు చెడు అంటే ఎవరు చెప్పగలరు?
దేన్ని అసహ్యించుకోవాలో స్వర్గం దాన్ని అసహ్యించుకొంటుంది.
ఎందుకు అలా చేస్తుందో ఎవరికీ తెలియదు.
జ్ఞానులు సైతం దాని గురించి ఇదమిద్ధంగా చెప్పలేరు.

పథం అతిగా శ్రమించదు గాని అన్నింటినీ జయిస్తుంది.
మాట్లాడదు, సమాధానం రాబడుతుంది.
అడుగదు, అన్నీ సమకూరుతవి.
లక్ష్యం వున్నట్టు వుండదు. ప్రయోజనం నెరవేరుతుంది.

స్వర్గం దగ్గర వున్న వల పెద్దది.
రంధ్రాలు పెద్దవైనా దాని నుండి ఏదీ తప్పించుకోలేదు.

## 74

ప్రజలకు మృత్యుభయం లేనపుడు
వారికి మృత్యువుని చూపి భయపెట్టడం దేనికి?

ప్రజలకు అనవరతం మృత్యుభయం కలిగించి
పనితనం గలవారిని పట్టి చంపటం సాధ్యమే అయినా
అలా చేసేందుకు సాహసించేదెవరు?

విధి రూపంలో తలారి ఒకడు పైన వుండనే వున్నాడు.
అతని స్థానాన్ని నీవు ఆక్రమించాలనుకోవటం
నేర్పరి అయిన వడ్రంగి పని నీవు చేయబూనటం వంటిది.
అతడిలా కర్రను చెక్కబోయి
నీ చేతుల్నే నీవు నరుక్కొంటావు.

# 75

ప్రజలు ఆకలితో ఎందుకు అలమటిస్తారు?
పాలకులు అధిక పన్నుల రూపంలో అందినంత తినెయ్యటం వల్ల.

ప్రజలు ఎందుకు తిరుగుబాటు లేవదీస్తారు?
పాలకులు వాళ్ళ దైనందిన జీవితాల్లో జోక్యం చేసుకోవటం వల్ల.

ప్రజలు మృత్యువును అంత తేలికగా ఎందుకు తీసుకొంటారు?
పాలకులు తమ సొంత జీవితం పట్ల అతి శ్రద్ధ చూపటం వల్ల.

జీవితం కొరకు ప్రజలు క్రియా పరతంత్రులు కాకపోవటం వల్ల
క్రియా పరతంత్రులు అయినవారి కంటే ఉత్తములు.

# 76

మనిషి పుట్టినప్పుడు మెత్తగా బలహీనంగా వుంటాడు. చనిపోయినప్పుడు బిర్రబిగిసి కఠినంగా వుంటాడు. పదివేల ప్రాణులు, మొక్కలు, వృక్షాలు బతికి వుండగా మృదువుగా, కోమలంగా వుంటవి. చనిపోయినప్పుడు పెళుసుబారి ఎండి వుంటవి. గట్టిగాను, కఠినంగాను ఏదైతే వున్నదో అది మృత్యువుకు సహచరి. ఏదైతే సున్నితంగాను, బలహీనంగాను వున్నదో, అది జీవానికి సహచరి. అందువల్ల ఏ ఆయుధం అత్యంత కఠినంగా వుంటుందో అది విరచబడుతుంది. ఏ వృక్షమైతే అత్యంత కఠినమైన చెక్కను కలిగి వుంటుందో అది కోయబడుతుంది. నిజం చెప్పాలంటే, కఠినము, బలవత్తరము అయినది కూల్చబడుతుంది. మెత్తనిది బలహీనమయినది ఉన్నతస్థితిలో ఉంచబడుతుంది.

## 77

పథం వింటిబద్దను వంచటం లాంటిది. విల్లు వంగినపుడు పైన వున్న చివర కిందికి వాలుతుంది. కిందవున్న చివర పైకి లేస్తుంది. ఈ విధంగానే పథం కూడా అధికంగా వున్న వాళ్ళ దగ్గర నుండి తీసికొని లేనివాళ్ళకు ఇస్తుంది. ఉన్నవాళ్ళ దగ్గర నుండి తీసుకొని లేనివాళ్ళకు ఇవ్వటం అనేది ఆకాశపథం అయితే, మనుష్యపథం దీనికి పూర్తిగా వ్యతిరేకం. అది ఏమీ లేని వాళ్ళ దగ్గర నుండి తీసుకొని, అధికంగా వున్నవాళ్లకు ఇస్తుంది. ఒక్కడంటే ఒక్కడు వున్నాడు. అతడెంతటి భాగ్యశాలి అంటే సర్వులకు తనకు వున్నది అంతా ఇవ్వగల స్తోమత వున్నదతనికి. ఎవరితడు? అతడే పథాన్ని సొంతం జేసుకొన్న జ్ఞాని. అతడు పేరు ఆశించకుండా విధ్యుక్త కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. పని పూర్తయాక దాని గురించి పట్టించుకోడు. అనగా ఫలితం ఆశించడు. తమ జ్ఞానాన్ని వారు ప్రదర్శనకు పెట్టరు.

# 78

ఆకాశం కింద వున్న వాటిలో
నీటికంటే మెత్తనైనది దుర్బలమైనది వేరొకటి లేదు.
అయితే, గట్టి వాటిని బలమైన వాటిని
ఎదుర్కొనేటప్పుడు దాన్ని మించింది లేదు,
దానితో సమానమైనది లేదు.

బలహీనమైనది బలమైన దానిని జయించగలదు.
మృదువైనది గట్టిదానిని జయించగలదు.
ఆకాశం కింద ప్రతి ఒక్కరికీ ఇది తెలుసు.
కాని ఎవరూ దీన్ని ఆచరణలో పెట్టరు.

అందువల్ల జ్ఞాని అంటాడు:
'ప్రజల కష్టనష్టాలు నీవిగా చేసుకొంటే
వాళ్ళని పాలించటానికి యోగ్యుడవవుతావు
ఒక దేశం యొక్క విపత్తులను నీ మీద వేసుకొంటే
మొత్తం ప్రపంచాన్ని పాలించటానికి సమర్థుడవవుతావు.'

నిజం చాలా సార్లు నిష్ఠురంగా తోస్తుంది.

## 79

తీవ్ర వివాదం ముగిసినాక, ఎంతో కొంత వైమనస్యం
మిగిలి వుంటుంది.
దీన్ని గురించి ఏమి చేయాలి?

జ్ఞాని బాకీదారుణ్ణి న్యాయస్థానానికి ఈడ్వడు.
గుణవంతుడు నిర్బంధ విధానానికి పాల్పడడు.
గుణహీనుడు మటుకే తీవ్ర విధానాన్ని అనుసరిస్తాడు.
గుణవంతుడు తన కర్తవ్యం తాను స్వయంగా నిర్వహిస్తాడు.
గుణహీనుడు తన కర్తవ్యాన్ని ఇతరుల మీద మోపుతాడు.

ఆకాశ పథానికి పక్షపాతం లేదు.
అది ఎప్పుడూ సత్పురుషుల పక్షానే వుంటుంది.

# 80

రాజ్యం చిన్నగా, జనం తక్కువగా వుండాలి. వుంటే ఎలా వుంటుంది. ఇలా. మనుషుల కంటే పదిరెట్లు వందరెట్లు ఎక్కువగా పనిచేసే యంత్రాలు వున్నప్పటికీ, వాటిని వాళ్ళు వుపయోగంలో పెట్టరు. వారు మృత్యువును తేలికగా తీసుకోరు కాబట్టి వారు వేరే దేశాలకు వలస పోరు. ఓడలు బళ్ళు వున్నప్పటికీ ఎవరూ వాటిని వాడరు. యుద్ధానికి కావలసిన అన్ని రకాల కవచాలు, ఆయుధాలు వారి వద్ద సిద్ధంగా వున్నప్పటికీ ఎవరూ వాటిని ధరించి కవాతు చేయరు. రాత కోతలు లెక్క పత్రాలకు బదులు ప్రజలు తాళ్ళతో ముడులు వేయటానికే ఇష్టపడతారు. వాళ్ళ ఆహారం రుచికరంగా, ఆరోగ్యకరంగా, దుస్తులు అందంగా, సాదాసీదాగా, ఇళ్ళు సురక్షితంగా వుంటవి. సంతుష్టిగా సుఖంగా జీవిస్తారు వాళ్ళు. పక్కరాజ్యం కనుచూపు మేరలో వున్నా, అక్కడి నుండి కుక్కలు మొరగటం, కోళ్ళు కూయుటం వినపడుతున్నా, ప్రజలు ముసలివాళ్ళయి చనిపోతే చనిపోతారు గాని, ఆ పక్క రాజ్యానికి వెళ్ళరు.

# 81

సత్యవాక్కులు ప్రియంగా వుండవు.
ప్రియంగా వుండేవి సత్యవాక్కులు కావు.
మంచివాళ్ళు వాదనకు దిగరు.
వాదనకు కాలు దువ్వేవారు మంచివాళ్ళు కారు.

జ్ఞానం అంటే ఎక్కువ విషయాలు తెలుసుకోవటం కాదు.
ఎక్కువ విషయాలు తెలుసుకోవటం జ్ఞానం అనిపించుకోదు.

జ్ఞాని ధనం కూడబెట్టడు.
ఉన్నదంతా ఇతరులకు ఇచ్చివేసినా
అతడికి సమస్తం సమృద్ధిగా వుంటుంది.
ఎంత ఎక్కువగా ఇతరులకు ఇచ్చి వేస్తే
అంత ఎక్కువగా తిరిగి వస్తుంది.

ఆకాశపథం వల్ల లాభమే కాని నష్టం లేదు.
జ్ఞాని కర్మణ్యుడు కాకుండానే కార్యం నిర్వహిస్తాడు.

# Bibliography


Blankney, R.B. The way of life : Lao Tzu
Bynner, Witter. The way of life according to Lao Tzu
Carus, Paul. The cannon of reason and virtue
Chau, Wing-Tsit. The way of Lao Tzu
Ch'u, Ta-Kao. Tao Te ching
Lin Yutang. The wisdom of Laotse
Mitchell, Stephen. Tao Te ching
Gia-Fu Feng and Jane English. Tao Te Ching
Arthur Waley. Tao Te Ching
James Legge. Tao Te Ching
D.C. Lau. Tao Te Ching
Mikhail Nikolenko. Tao Te Ching (Translated from Russian into English)
H.G. Ostwald. Tao Te Ching (Translated from German into English)
Robert Eno. Tao Te Ching

# దీవి సుబ్బారావు రచనలు

**కవితలు** : 1. వైశాఖ సముద్రం 2. హంసలదీవి
3. చిన్నప్పుడన్నీ ఆశ్చర్యమే 4. సూరీడు

**కథలు** : 1. కృపావర్షం 2. అడవి పాడింది

**నాటికలు** : అర్థగౌరవం
యోగావసిష్ఠం, భారతం, యామునాచార్య చరిత్ర.
కాళిదాసు, భారవి గురించిన కథలు ఆధారంగా రచించినవి.

**బాలసాహిత్యం** : అలీబాబా నలభై దొంగలు

**సంపాదకత్వం, పరిష్కరణ** : తత్వగీతం
పోతులూరి వీరబ్రహ్మం, ముదుమాల సిద్ధయ్య,
యాగంటి లక్ష్మప్ప తదితరుల తత్వగీతాలు

**వ్యాసాలు** : నిత్యజీవితంలో ఆధ్యాత్మికత

**అనువాదం :**

1. మాటన్నది జ్యోతిర్లింగం : బసవన్న, అక్క మహాదేవి, దేవర దాసిమయ్య, అల్లమ ప్రభు కన్నడ వచనాలకు తెలుగు అనువాదం.
2. నవనవం : వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, బుద్ధుడు, శ్లోకాలకు తెలుగు అనువాదం
3. సూఫీ కవిత్వం : మౌలానా జలాలుద్దీన్ రూమీ, రబియా, ఫరీవుద్దీన్ అత్తార్, హాఫిజ్ సూఫీ కవితలకు తెలుగు అనువాదం.
4. పరమగీతం : బైబిల్ ఓల్డ్‌టెస్ట్‌మెంట్‌లోని 'సాంగ్ ఆఫ్ సోలమన్'కు తెలుగు అనువాదం.
5. ధూళిగా మార్చే ప్రేమపథం : మెహెర్‌బాబా గజల్ కవితలకు తెలుగు అనువాదం.
6. ప్రాకృత గాథా సప్తశతి : శాతవాహన చక్రవర్తి హాలుడు సంకలనానికి తెలుగు అనువాదం
7. తావొ తె చింగ్ : లావో త్సు మూల చీనీ రచనకు ఇంగ్లీషు నుండి తెలుగు అనువాదం.

**తా**వొ తె చింగ్ చైనీయుల ఆలోచనా విధానాన్నీ సంస్కృతినీ గాఢంగా ప్రభావితం చేసిన ఉద్గ్రంథం. క్రీస్తు పూర్వం ఐదు, ఆరు శతాబ్దాల నాటి రచన. గ్రంథకర్త లావో త్సు.

ఈ గ్రంథం ప్రపంచంలోని ముఖ్యమైన చాలా భాషల్లోకి అనువాదం ఈ వరకే అయింది. కవితాత్మకంగా, గూఢార్థభరితంగా ఉండటం ఈ గ్రంథం ప్రత్యేకత.

గ్రంథం 2500 ఏళ్ళ కిందటిది కావచ్చుగాని, ఈ కాలానికి వర్తించే జీవిత సత్యాలు ఇందులో వున్నవి. మనుషుల్ని చైనీయులుగా, అమెరికన్లుగా, యూరోపియన్లుగా, భారతీయులుగా ఇట్లా అనేక విధాలుగా విడగొట్టకుండా ఒక్క మానవులుగా చూసినప్పుడు ఋషివంటి లావో త్సు మాటలు మనందరికీ శిరోధార్యాలవుతాయి.

Tao Te Ching
Lao Tzu
*Translation from English:*
Deevi Subba Rao

₹ 100/-

